www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 జులై 2023
5
తూర్పుగోదావరి



గ్రామాల్లో పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం లోని అన్ని గ్రామాలలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జులై 7వ తేదీ నుంచి 14వ తేదీ పాడి రైతులకు పశుగ్రాస భద్రత, నూతన మేలు జాతి పశుగ్రాస రకాల ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం 75 శాతం రాయితీతో మేలు రకం పశుగ్రాస విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తుందన్నారు. అజోల్లా, హైడ్రోపోనిక్స్, సైలేజ్, ఎండు గడ్డిని యూరియాతో కలిపి మేపడం తదితర పద్ధతులను వివరించారు. చాగల్లు గ్రామంలో జరిగిన సభకు కొవ్వూరు ఏడీ డాక్టర్ వెంకటరెడ్డి మరియు మార్కొండపాడులో జరిగిన కార్యక్రమానికి కొవ్వూరుడివిజన్ ఉపసంచాలకులు డా.రాధాకృష్ణ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

వేతనాలు పెంచకుంటే మరో ఉద్యమం

- ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తే పాలకులకు తగిన బుద్ధి చెబుతాం
- అంగన్‌వాడీల ధర్నాలో పలువురు నాయకులు
- మద్దతు తెలిపిన మాజీ ఎంపీ హర్షకుమార్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, జనసేన నాయకులు కందుల దుర్గేష్



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేతనాలు పెంపోతే మరో ఉద్యమం తప్పదని, ఐసిడిఎస్‌ని నిర్వీర్యం చేయాలని చూస్తే పాలకులకు తగిన బుద్ధి చెబుతామని, అంగన్‌వాడీల ధర్నాలో పలువురు నాయకులు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటలు మహాధర్నా 2వ రోజు జరిగింది. ఈ మహాధర్నాకు జిల్లా నలుమూలల నుండి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హాజరయ్యారు. తొలుత అంగన్‌వాడీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ ధర్నాలో శిబిరంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచట్లేదన్నారు. 40 ఏళ్లుగా పేదలకుసేవలందిస్తున్నా తగిన గుర్తింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాల్సింది పోయి ఏటేటా తగ్గిస్తుందన్నారు. ఐసిడిఎస్ నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు కంకణం కట్టుకున్నారని అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న అంగన్‌వాడీలకు టిడిపి సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. అసెంబ్లీలో సమస్యలపై మాట్లాడతామని తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. వీరి పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ దీక్షా శిబిరానికి విచ్చేసి మద్దతు పలికారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యంబ, వై.బేబిరాణి మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణకు 36 గంటల ధర్నా చేపట్టామన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. గత ఎన్నికలు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణా కంటే ఎక్కువ వేతనం అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా గ్రాడ్యూటీని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయడం లేదన్నారు. రాజకీయ అధికారం వేధింపులు తీవ్రంగా పెరిగాయని, పని ఒత్తిడి పెరిగిందన్నారు. రోజుకొక యాప్ తీసుకొచ్చి తీవ్ర పని ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ ధర్నాలో ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, కోదండరామ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రాంబాబు, ఎం రాజా, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పోశమ్మ మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో నాయకులు వై.సుజాత, సునీత, రామలక్ష్మి, అన్నపూర్ణ, ఎం.మార్త, దుర్గాంబ, సుబ్బలక్ష్మి, మాలతి, సుజాత, సరద, రామాలక్ష్మి పాల్గొన్నారు.


మద్దతు తెలుపుతున్న హర్షకుమార్



మాట్లాడుతున్న ఆదిరెడ్డి అప్పారావు



అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-దేవరపల్లి

ఏలూరు వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ గ్రామ వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దేవరపల్లి మండలంలోని గ్రామ వాలంటీర్లు మంగళవారం దేవరపల్లిలో నిరసన ర్యాలీ చేపట్టి మండల తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వాలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. **గోకవరం** మండల కేంద్రమైన గోకవరం సచివాలయం వద్ద మంగళవారం జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదెల పవన్ కళ్యాణ్ గ్రామ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై వాలంటీర్లు అధిక సంఖ్యలో నిరసనలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. పలువురు గ్రామ వాలంటీర్లు మాట్లాడుతూ వితంతువులు ఒంటరి వ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనకకు తీసుకొని గ్రామ వాలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. అనంతరం సచివాలయం నుంచి గోకవరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్లో పవన్ కళ్యాణ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. అధిక సంఖ్యలో గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.


దేవరపల్లిలో వాలంటీర్ల నిరసన

నర్సరీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-కడియం

సుదీర్ఘకాలం తర్వాత కడియం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కు ఎట్టకేలకు ఎన్నికల ప్రక్రియ మొదలయింది. అంతా ఏకగ్రీవమయ్యారు. పలు దఫాలు ఎన్నికల ప్రక్రియ మొదలయ్యి, రాజకీయ కారణాలతో వాయిదా పడుతూ ఉత్కంఠ రేపిన ఎన్నికలు, ప్రశాంతంగా ఏకగ్రీవం అవడంతో నర్సరీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 16న జరగాల్సిన ఎన్నికలు నామినేషన్ల ఉపసంహరణ రోజైన మంగళవారం ఏకగ్రీవంగా ముగిశాయి. అయితే ముందు మాకు, తర్వాత మీకు అనే ధోరణిలో రెండు పాలకవర్గాలు, రెండు దఫాలుగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. వీరిలో కొందరు సగం రోజులు (18 నెలలు) , మరికొందరు పూర్తి కాలం (36 నెలలు) పదవులలో కొనసాగనున్నారు. నర్సరీ పెద్దలు గట్టి సుబ్బారావు, పల్ల సుబ్రహ్మణ్యం, తాడాల చక్రవర్తి, పుల్లా ఆంజనేయులు, మార్గాని సత్యనారాయణ, పాతంశెట్టి చిన్న మహాలక్ష్మి నాయుడు, తిరుమలశెట్టి భాస్కర రావు, బొర్రు సుబ్బారాయుడు, కొత్తపల్లి శివాజీ, బొర్రు వెంకటేశ్వరరావు, రత్నం కృష్ణమూర్తిల సమక్షంలో జరిగిన ఏకగ్రీవ ప్రక్రియ కొందరికి ఇష్టంగానూ, మరికొందరికి అయిష్టంగాను ఉన్నట్లు సమాచారం. అయినా పెద్దల మాటలకు విలువ ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. మల్లు పోలరోజు అధ్యక్షులు గాను, రావిపాటి రామకృష్ణ, జంగా సుబ్బారావు, గట్టా కృష్ణ భగవాన్, గరగ నాగేశ్వరరావు, తాడాల బాలమురళీకృష్ణ డైరెక్టర్లు గా మొదటి దఫా 18 నెలలు కొనసాగనుండగా, పెనుమాక బులికొండయ్య ఉపాధ్యక్షులు గాను, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీనివాస్, అడ్డగర్ల రమేష్, గాద నాగేశ్వరరావు, కొండేపూడి సత్యనారాయణలు మొదటి దఫాలోనే పూర్తికాలం 36 నెలలు పదవుల్లో కొనసాగనున్నారు. రెండవ పర్యాయం రత్నం అయ్యప్ప అధ్యక్షులుగా 18 నెలలు కొనసాగనున్నారు.


ఏకగ్రీవంగాఎన్నికైననర్సరీఅసోసియేషన్ పాలకవర్గం

అక్రమ ఇసుక తవ్వకాలు నిలివేయాలి

ప్రజాశక్తి-సీతానగరం


మునికూడలి, వెదుళ్ళపల్లి గ్రామాలకు చెందిన రైతుల పట్టాభూముల్లో అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలంటూ మంగళవారం ఆందోళన చేపట్టారు. సుధాకర్ నాయుడు, కవల కృష్ణమూర్తి ఇద్దరు కలిసి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సుమారు 90 ఎకరాల్లో రైతులు ఎవరికి కూడా ఒక్క రూపాయి చెల్లించకుండా, ప్రభుత్వం నుంచి అనుమతులు పొందకుండా పోలీసుల అండదండలతో రూ.113 కోట్ల 40 లక్షల ఇసుక తరలించుకుపోయారన్నారని ఆందోళన చేపట్టారు. రైతులకు, ర్యాంపు నిర్వాహకులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక సీతానగరం ఎస్ఐ చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి ఆందోళన విరమించాలని కోరారు. టిడిపి బిసి నేత బర్ల బాబురావుకి రైతులందరూ కూడా వారికి జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేయడంతో జగనన్నకి చెబుదాంలో జూలై 10ర బర్ల ఫిర్యాదు చేశారన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ బర్ల బాబురావు అండగా ఉంటానని తెలియజేశారు. రైతులు, కూలీలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పరిశీలిన

ప్రజాశక్తి - సీతానగరం

కాతేరు నుంచి సీతానగరం వరకు సుమారు రూ.105 కోట్లతో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను మంగళవారం రహదారి భవనాలు శాఖ అధికారులు పరిశీలించారు. ముగ్గళ్ళ నుంచి రవీంద్ర కాలనీ వరకు జరిగే గ్రావెల్ పై మెదటి దశ తారు రోడ్డు పనులను రోడ్డు కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇ వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ‘నిజం’



మీరు పార్టీ నాయకునిగా కన్నా.. సినీ హీరోగా పని చేస్తారేమోనని ఇతన్ని తీసుకొచ్చా సార్..!!

సమస్యల పరిష్కారానికే ‘జగనన్న సురక్ష’

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్య పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. పలు చోట్ల మంగళవారంజగనన్న సురక్ష కార్యక్రమం పలుచోట్ల నిర్వహించారు. **గోకవరం** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు.కొత్తపల్లి గ్రామ సచివాలయంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ చంటి బాబు పాల్గొని మాట్లాడుతూ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు వైసిపి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సచివాలయంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కొత్తపల్లి సచివాలయంలో 1,2లో 2358 ధ్రువపత్రాలను లబ్ధిదారులను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, పలుశాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం గజ్జరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 675 మందికి ధ్రువీకరణ పత్రాలను ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ రాంబాబు, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ తదితరులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకటరమణ, డిటి అహ్మద్, కార్యదర్శి హేమంతి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జగ్గంపేట ఎంఎల్‌ఎ చంటిబాబు

నిడదవోలు వీక్లీ మార్కెట్ దగ్గర ఉన్న సచివాలయంలో జగనన్న సురక్ష ప్రోగ్రాం మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ మున్సిపల్ ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించాలన్నదే వైసిపి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. నిడదవోలు పట్టణంలో ఇప్పటికే సుమారు 4,470 వివిధ దవపత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, షేక్ వజిరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాసు, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, గుర్రం జేమ్స్ మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి సచివాలయ సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. **సీతానగరం** సీతానగరం గ్రామపంచాయతీ సచివాలయం - 2లో సర్పంచ్ కొండ్రపు ముత్యాలు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ సత్యనారాయణ రాజు హాజరయ్యారు. కార్యక్రమం ఉద్దేశించి మండల ఎమ్మార్వో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ గంటా శ్రీనివాసరావు, మండల ఎస్‌సి సెల్ మద్దాల కొండలరావు, ఆత్మా కమిటీ చైర్మన్ డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-రాజానగరం

కరోనాసమయంలో అందరికీ సేవలందించిన వాలంటీర్లుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధినేత పవన కళ్యాణ్ చరిత్ర హీనుడుగా ఉంటారని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆరోపించారు. రాజానగరం సచివాలయం-3 లో జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కు ఏ నిఘా సంస్థలు ద్వారా సమాచారం వచ్చింది చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సిఎం చంద్రబాబు రాసిన స్క్రిప్ట్ పవన్ కళ్యాణ్ చదువుతున్నారని తెలిపారు. పేదలకు ఇళ్ళు స్థలాలు వారు నివాసం ఉంటున్న గ్రామంలో ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఎక్కడైనా ఉంటే గుర్తించాలని వెంటనే అందించాలని ఆదేశించారు. జగనన్నసురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందని వారు అక్కడక్కడా ఒక శాతం మంది ఉన్నారని వారిని గుర్తించి పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దూరం పెద్ద, గంగిశెట్టి సోమేశ్వరరావు, కోలపాటి వెంకన్న, గండి నానిబాబు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంపై దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

ప్రకాశం జిల్లా దర్శి సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని, వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-నిడదవోలు

విశాఖపట్నం మధురవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మంగళవారం తూర్పు గోదావరి జిల్లా కెవిపిఎస్ నాయకులు నిడదవోలు అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ మధురవాడ నిందితులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టి.సర్వేశ్వర రావు, దాకే సతీష్. కుంచే అశోక్, ఎమ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయమే ‘పొలంబడి’ లక్ష్యం

ప్రజాశక్తి-గోపాలపురం

రైతులు సాగులో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం అని వ్యవసాయ అధికారి బి. రాజారావు తెలిపారు. మంగళంవారం మండలంలోని భీమోలు గ్రామంలో వరి పైరు పంటలో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ సార్వ సీజన్ లో భీమోలు, కొవ్వురుపాడు గ్రామాలలో పొలంబడి ను వరి పంట విత్తే సమయం నుండి కోత కోసే వరకు కూడా ఈ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. పొలంబడి నాలుగు ముఖ్య సూత్రాలను అనుసరించాలని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ సిసిలీ, మణికంఠ, ఝాన్సీ, రైతులు రాంపండు, దొరబాబు, చంద్ర రావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

పలుచోట్ల టిడిపి శ్రేణుల పాదయాత్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో మంగళవారం ఆపార్టీ శ్రేణులు సంఘీభావయాత్రలు చేశారు.

తాళ్లపూడి యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మండలం లో టిడిపి నాయకులు పాదయాత్ర నిర్వహించారు.కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో వేగేశ్వరపురం నుంచి తాళ్లపూడి ప్రక్కిలంక మీదుగా పైడిమట్ట జంక్షన్ వరకు సాగిన ఈ పాదయాత్రలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. పాదయాత్రకు వచ్చిన ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకష్ణ లకు తాళ్లపూడి మండల టిడిపి శాఖ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, నాయకులు కైగాల శ్రీను ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిధిలోని కొవ్వూరు తాళ్లపూడి చాగల్లు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తాళ్లపూడి లో పాదయాత్ర ముగింపు అనంతరం పైడిమెట్ల జంక్షన్ వద్ద గల రావి పార్టీ ఫంక్షన్ హాల్ లో జరిగిన టిడిపి సమావేశానికి కొవ్వూరు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు గొర్రెల శ్రీధర్ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొవ్వూరు ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. **గోకవరం** లోకేష్ యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో ప్రజా చైతన్యం వచ్చిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కషునిపాలెం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్దనుండి గ్రామ శివారు శివాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మంగ రౌతు రామకష్ణ, కన్నబాబు ఉంగరాల రాము తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** లోకేష్ యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా యాత్ర కు సంఘీభావంగా సూర్యారావు పాలెం గ్రామం నుండి పసలపూడి వరకు టిడిపి నాయకులు పాదయాత్ర నిర్వహించారు. నిడదవోలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, నిడదవోలు మండల టిడిపి అధ్యక్షులు వెలగన సూర్యారావు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ భూపతిరాజు రవివర్మ, కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో సంఘీభావ యాత్ర చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

45 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

దమ్మెన్ను గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ను గ్రామ సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరం లో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నట్లు కంటి వైద్యులు డాక్టర్ టి.రాంబాబు తెలిపారు. పదిమందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించామన్నారు. మిగిలిన వారికి మందులు, ఐ డ్రాప్స్ పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌ఒ, ఎం.రమ్య, ఎఎన్ఎం, ఎస్-ఎస్. నాగమణి, హెల్త్ అసిస్టెంట్ సీతయ్య, ఆశాలు ఐ సంతోషి, జ్యోత్స్న లు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని జిల్లాలో మంగళవారం నిర్వహించారు. పలుచోట్ల అవగాహనా ర్యాలీ లు నిర్వహించారు. **రాజమహేంద్రవరం** కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా నియంత్రణ నోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో కళాశాల ఆర్థికశాఖ విభాగం మరియు ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల అధికారినులు మరియు వాలంటీర్లు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ పరిధిలో అధిక జనాభా నివారణకై స్లోగన్స్ ద్వారా జనాభా అరికట్టే ఆవశ్యకతను తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ అధికారినులు ఎమ్.కాస్మ, కె.వీరలక్ష్మి, పి.శ్రీదేవి, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ బి. అనురాధ సూర్య కుమారి మరియు ఆర్థిక శాఖాధిపతి డివికేఎస్ లక్ష్మి అధ్యాపకులు బి.చంటమ్మ, సివి.రామలక్ష్మి లను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి అభినందించారు. **చాగల్లు** ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా బ్రాహ్మణగూడెం పిహెచ్‌సిలో ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నిశిత, డాక్టర్ బిఆర్ఎల్. దేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **గోకవరం**ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని డాక్టర్ వనజ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిహెచ్ఇఒ వైయస్.రాయుడు మాట్లాడుతూ ప్రజలందరూ పరిమిత కుటుంబం ఆవశ్యకతను తెలుసుకొని వివిధ కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంబించి జనాభా పెరుగుదల అరికట్టుటకు తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రీ సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, మండపాటి సతీష్, ఆరోగ్య సిబ్బంది శ్రీను, శైలజ, శ్రీనివాసు, అంగన్‌వాడీ సూపర్వైజర్ ఇందిరారాణి, పవన్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక జనాభా వలన సంభవించే నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సుభాషిణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని హుక్కుంపేట పిహెచ్‌సి పరిధిలోని గుడ్డిగూడెం గ్రామంలో వైద్యులు జె.శ్రీనివాస్, బివివి.దుర్గ భవాని ఆదేశాల మేరకు ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వతంత్ర అమృత మహోత్సవ సందర్భంగా కుటుంబ సంతోషం, శ్రేయస్సు కొరకు, కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని కొత్త నినాదంతో, సోగన్స్‌తో ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణ అరికట్టేందుకు పాటించవలసిన తాత్కాలిక మరియు శాశ్వత పద్ధతులను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆర్.రుతమ్మ, సూపర్వైజర్ శ్యాం బాబు, సిబ్బంది ఎ. త్రిమూర్తులు, పి.కన్నమ్మ, మంజుల, ఆశాలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

22 కిలోల గంజాయి పట్టివేత
ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు గంజాయి చేరవేస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా ఉంచి అయిదుగురిని అరెస్ట్ చేసి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఎస్‌పి కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 133 మంది గంజాయి సరఫరా చేసే, తాగే వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితులపై గంజాయి షీట్స్ ఓపెన్ చేస్తామని చెప్పాడు. ఎవరైనా ఇలాంటి సంఘటనలపై సమాచారం ఇస్తే రూ.50 వేలు రివార్డు అందిస్తామన్నారు. పెదపూడి మండలం చింతల లాకులకు చెందిన వాసంశెట్టి బన్నీ, కాకినాడ టౌన్, కొండయ్యపాలెంకు చెందిన మర్రెడ్డి దినేశ్వరరావు, రామచంద్రపురం మండలం పెదతాళ్లపొలం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సత్యనారాయణ, ప్రత్తిపాడు మండలం బావురువాకకు చెందిన కించు అప్పారావు, పిఠాపురం టౌన్ అగ్రహానికి చెందిన సంఘటాల రాజేష్‌ను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు.

బాలుని అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి బాలుడు అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిడదవోలు మండలం అట్లపాడుకు చెందిన ముప్పిడి గౌతమ్ వేలివెన్ను శశి స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు ముప్పిడి ప్రసన్నకుమార్, మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కె.రామారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మండపేట

స్థానిక వీరభద్రపురం రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కడియం మండలం జేగురుపాడుకు చెందిన కాకాడ అనిల్, బత్తిన చిట్టిబాబు (25) బైకుపై రామచంద్రపురం రోడ్డు మీదుగా అతివేగంగా నడుపుతూ హఠాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనక కూర్చొన్న చిట్టిబాబు ఎగిరి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కాగా అక్కడిక్కడే మృతి చెందాడు. టౌన్ ఎస్‌ఐ మద్దాల అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైనతేయ గోదావరిలో యువకుని మృతదేహం

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నం వైనతేయ గోదావరిలో యువకుడు మృతదేహం మంగళవారం లభ్యమయింది. అదే గ్రామానికి చెందిన కడలి రమేష్‌దిగా స్థానికులు పోలీసులు గుర్తించారు. ముందు రోజునుండి రమేష్ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబికులు గాలించగా గోదావరి నదిలో అతడి మృతదేహం లభ్యమైనది. అతడికి భార్య ఉన్నారు. సోమవారం రాత్రి బహిర్భూమికి అని బైటకి వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మరణించి ఉంటారని అంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్‌ఐ షేక్ జానీ బాషా తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 42 బ్యాగుల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి కె.కుమార్, ఎంఎస్ఒ సుబ్బరాజు మాట్లాడుతూ స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు. బియ్యాన్ని నిల్వచేసిన కూసు సత్యనారాయణ 6 ఎ కేసు నమోదు చేశారు.

చైల్డ్‌లైన్‌కు పిల్లల అప్పగింత

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

భర్త నిరాదరణకు గురవడంతో బిడ్డలతో కలిసి ఒక మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన సాగిస్తుండగా పిల్లలను మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ లైన్‌కు అప్పగించినట్లు ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ బి.లోవరాజు తెలిపారు. ఏలేశ్వరానికి చెందిన మహిళ భర్త వదిలేయడంతో ముగ్గురు పిల్లలను పోషించుకునేందుకు భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు.

కాకినాడ పోర్ట్‌లో భద్రత కట్టుదిట్టం

ప్రజాశక్తి-కాకినాడ

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోర్టులో భద్రత మరింత కట్టుదిట్టం చేసినట్లు ఎస్‌పిఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు తెలిపారు. ప్రత్యేక రక్షణ దళం విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసు, ఎంకరేజ్ పోర్ట్ సిఐ జి.శ్రీధర్‌ను పోర్ట్‌లో భద్రతా చర్యలపై అరా తీశారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు భద్రతా అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కమాండెంట్ నరసింహారావును పోర్ట్ అధికారి ధర్మశాస్త్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, ఎస్‌టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వక్రీకరణ

ప్రజాశక్తి-కాకినాడ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాలంటీర్ల వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలను వైసిపి నేతలు, మంత్రులు, ఎంఎల్ఎలు వక్రీకరించారని జనసేన పార్టీ పిఎసి సభ్యుడు పంతం నానాజీ అన్నారు. మంగళవారం స్థానిక గోదారిగుంటలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ కొంతమంది వాలంటీర్లు ఇళ్ల నుంచి సేకరించిన డేటా దుర్వినియోగం చేస్తున్నారని మాత్రమే పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు తప్ప వాలంటరీ వ్యవస్థను విమర్శించలేదన్నారు. మొదట వాలంటరీ వ్యవస్థను విమర్శించింది వైసిపి మంత్రులు, ఎమ్మెల్యే లేనన్నారు. ఉద్యోగులపై నమ్మకం లేకనే వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని మహిళా కమిషన్ కోరిందని, తప్పిపోయిన 14 వేల మంది మహిళలు ఇంటికి వెళ్ళి వివరాలు సేకరించండని సూచించారు. తర్వాత కమిషన్ ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇస్తామన్నారు. పవన్ వాలంటీర్ల వ్యవస్థను ఏనాడు కించపరచలేదని వారిపై ఆయనకు అపార గౌరవం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పుల్లా శ్రీరాములు, పుల్లా శ్రీను, మురళి, వీరబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు అధిక సంఖ్యలో పెంచాలి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో ఉపాధి హామీ పనులు అధిక సంఖ్యలో పెంచాలని జిల్లా నీటి యాజమాన్య పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం గండేపల్లి మండలం పి.నాయకంపల్లిలో హార్టికల్చర్ రైతు మలిరెడ్డి గంగాభవాని వారి పొలమును పరిశీలించి తగుసూచనలు సలహాలు ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మండల అధికారి గంగాభవాని ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు అధిక సంఖ్యలో పెరిగేలా చూడాలని, దానికి క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కషి చేయాలి అన్నారు. గ్రామాల వారీగా సర్వే చేసి, పనులు గుర్తించి, పనులు జరిగేలా చూడాలని, అనంతరం మిగిలిన వారికి జాబ్ కార్డులు ఇవ్వడం ద్వారా మరింత పనులు వేగవంతం అయ్యేందుకు సహకారాలు ఆధార్‌కు సీడింగ్ మరియు బ్యాంకులో ఎన్‌పిసిఐ లింక్ ప్రతి వేతనదారునికీ చేయించాలని సూచించారు. ఎపిఒ గంగాభవాని, ఇసి రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా అధ్యాపకుల శిక్షణ

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బూట్ సారథ్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన అధ్యాపకుల అభివద్ధి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ప్రస్తుతం శరవేగంగా అభివద్ధి చెందుతున్న సాఫ్ట్వేర్ రంగంలో మెలకువలను అర్థం చేసుకోవడానికి ఇన్ఫోసిస్‌కు చెందిన కోడింగ్ నిపుణులు మీనాక్షి, గిరిజ, సంజయ్ జోస్లీన్ ఎంతో చక్కటి ఉదాహరణలతో అర్థవంతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలేజీలకు సంబంధించిన సుమారు 196 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యాపకులు ఎన్నో సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అధ్యాపకులు మొదటి దశలోనే ఈ అంశంపై సర్టిఫికేషన్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, కో ఆర్డినేటర్ డాక్టర్ కె.స్వరూప, అధ్యాపకులు, ఇతర కళాశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమూలపేటలో గడప గడపకూ..

ప్రజాశక్తి-యుకెపి

కొత్త మూలపేటలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. గ్రామానికి చెందిన కనకాల సత్యనారాయణ తన కుమారుడు కరోనా కరోనా సమయంలో మృతి చెందాడని, ప్రభుత్వం నుంచి సాయం అందలేదని తెలిపారు. దీంతో ఎంఎల్ఎ స్పందించి తక్షణమే సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారే సుధా శ్రీనివాస్, ఆనాల సుదర్శన్, అమరవల్లి సర్పంచ్ పులి జయబాబు, వడ్డే నాగమణి, దావీదు, కాపు రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వన్నె చింతలపూడి స్మశాన వాటికకు దారి ఏర్పాటు చేసి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్ కు స్థానిక యువకుడు భీమమహేష్ విన్నవించాడు. మంగళవారం కార్యక్రమంలో భాగంగా మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ వన్నె చింతలపూడి అంబేద్కర్ నగర్‌లో పర్యటించారు. అంబేద్కర్ నగర్ పర్యటనలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలని పరమట భీమా మహేష్ వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న భీమా మహేష్

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-మండపేట

పట్టణ పరిధిలోని ఐదవ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన పారిశుధ్య నిర్వహణ, వార్డు సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్నామన్నారు. చెత్త తరలింపు, డ్రెయిన్ల క్లీనింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇంట్లోనూ ఆరుబయట పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చుట్టు పక్కల ఎవరికైనా జ్వరం ఇతర అనారోగ్య పరిస్థితులు తలెత్తితే వలంటీర్లకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, మారిశెట్టి సత్యనారాయణ, వైసిపి టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మొండి మురళి, పెంకే గంగాధరం పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేస్తా

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సిఎం జగన్మోహన్ రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసేందుకు నియోజవర్గ వ్యాప్తంగా తిరుగుతూ పార్టీని పటిష్ట పరుస్తామని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండలం మన్యంవారిపాలెంలో మంగళవారం తన అనుచరులతో కలిసి ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ గతంలో జగ్గంపేట నియోజకవర్గానికి అనేక సేవలు అందించామని, నియోజకవర్గంలోని ప్రజలందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నానన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో నరసింహం కుమారుడు తోట రామ్‌జీ, అత్తులూరి సాయిబాబు, రామకుర్తి మూర్తి, ఎస్.ఎ.గఫూర్, తులా రాము ఉన్నారు.

డయల్ యువర్ ఎస్‌పికి 19 వినతులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్‌పి సతీష్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి కాలర్‌తో వారి సమస్యను వివరంగా అడిగి తెలుసుకున్న ఎస్‌పి నిర్ణీత వ్యవధిలో వారి సమస్య పరిష్కారం అయ్యేలా జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సంబధిత పోలీసు అధికారులను సమన్వయం చేస్తున్నామన్నారు. నాలుగు వారాల క్రితం ప్రారంభించిన డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమం ద్వారా గత మూడు వారాల్లో అందిన 48 ఫిర్యాదుల్లో 22 ఫిర్యాదులను సంబధిత పోలీస్ స్టేషన్ల అధికారులు పరిష్కరించినట్టు చెప్పారు. డయల్ యువర్ ఎస్‌పి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

కుక్క కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

అమీనాబాద్ గ్రామంలో కుక్కలు అధికమవడంతో గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో కుక్కలు అధికంగా ఉన్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఏప్రిల్ నెలలో విడతల వారీగా 14 మంది కుక్కకాటు గురయ్యారు. కుక్క కాటుకు గురైన గంటా భానుయ్య ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతు మంగళవారం మృతి చెందారు. ఆయనను కరిచిన కుక్క మరో 13 మందిని కరిచింది. వారు కూడా స్థానిక కొత్తపల్లి పిహెచ్‌సిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని కొత్తపల్లి వైద్యులు డాక్టర్ మౌనిక తెలిపారు. అవసరమైన మేరకు కాకినాడ నుండి మెరుగైన వైద్యం అందించినందుకు వైద్యులు వస్తారని తెలిపారు.

దుర్గంధంగా మారిన రైతు బజార్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ గాంధీ నగర్‌లో ఉన్న రైతు బజార్ చెత్తతో నిండి దుర్గంధ భరితంగా మారింది. ఆ రైతు బజార్లో రోజువారీ చెత్త వర్షాలకు కుళ్లిపోవడంతో దుర్వాసన వస్తోంది. ఆ ప్రాంతం అంతా దుర్గంధభరితంగా మారింది. దీనిపై నగరపాలక ప్రజారోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలి. లేని పక్షంలో అక్కడకు చేరే చెత్త, చెదారం వల్ల రోగాలు పాలయ్యే అవకాశం ఉందని పలువురు బజారుకు వచ్చే వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వైసిపి ప్రభుత్వంలో కులవత్తులకు ప్రోత్సాహం కరువైందని టిడిపి రాష్ట్ర గాండ్ల, తెలుకల సంఘం అధ్యక్షురాలు విశాలాక్షి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రవరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెబిలి ఈశ్వరరావు, కొసనం సత్యనారాయణ, దండు సూరిబాబు, పారేపల్లి సాయి ఉన్నారు.

వాలంటీర్లకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి -కరప

వాలంటీర్లకు ప్రభుత్వం అండగా ఉందని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని కన్నబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్, ఎంపిడిఒ కె.అప్పారావు, తాహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎంఇఒ బుల్లి కృష్ణవేణి, ఎంఇఒ టివివి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ జెఇ శైలజ పాల్గొన్నారు.

కూలీలకు గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని బలరామపురంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ ఇంజనీరింగ్ అధికారి బాలకష్ణ క్షేత్ర సహాయకులు ఎం.లోవలక్ష్మీ గుర్తింపు కార్డులను అందజేశారు.

ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

జగన్నాధపురం ఫోటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం భానుగుడి సెంటర్ సోము ప్రసాద్ కళ్యాణ మండపంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షునిగా పిల్లా కళ్యాణ్, సెక్రటరీగా కొప్పాడి సతీష్, ట్రెజరర్‌గా యాళ్ల రాజా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చినబాబు, కూడా చైర్మన్ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, హాజరయ్యారు.

నిత్యావసరాలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రామచంద్రపురం మండలంలోని వెంకటాయపాలెం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ యల్లమిల్లి కుమారి అధ్యక్షతన జరిగిన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు మేర్నిడి వేంకటేశ్వరరావు, ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంసెట్టి శ్యామ్, పశుసంవర్ధక శాఖ ఎడి రామకష్ణ, మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఇయు విర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పడి 72 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏలేశ్వరం డిపోలో కార్మికులు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సీనియర్ నాయకుడు ఎస్ఎస్.నారాయణ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1952లో యూనియన్ ఏర్పడి కార్మిక సమస్యలు పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి యుబిఎం కుమార్, అధ్యక్షుడు నాని బాబు, గ్యారేజ్ కార్యదర్శి జిఎస్ చలం, సిసిఎస్ డెలికేట్ వి.నల్లయ్య, ఎన్‌వి.రావు, తిరుమల జిఎస్, టిజెపి ం

ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షునిగా వర్మ

ప్రజాశక్తి - తాళ్లరేవు

సత్య సాయి హైస్కూల్ అధినేత పిఎస్.వర్మ తాళ్లరేవు మండల ప్రైవేట్ స్కూల్స్ సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. మంగళవారం తాళ్లరేవులో జరిగిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షునిగా వర్మ, కార్యదర్శిగా పటవల సాయి తేజ స్కూల్‌కు చెందిన బోనం శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షునిగా ధూళిపూడి చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

బాండ్ సర్టిఫికేషన్ కోసం స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ రావిరాల మహేష్ మంగళవారం బాండ్ సర్టిఫికేషన్ మంజూరు చేయడం కోసం వివేకానంద స్థలాన్ని, మసీదు సెంటర్ వెనక స్థలాన్ని, 20 వార్డు మహాలక్ష్మి నగర్ డెంటల్ కాలేజ్ వద్ద సర్వే బౌండ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా టిడిఆర్ ఇవ్వడం కోసం పలు స్థలాలను పరిశీలించినట్లు చెప్పారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిసిపి కె.హరిదాసు, సర్వేయర్ సీతారామ ఆచార్య, ఎసిపి కెవి నాగశాస్త్రులు, టిసిపి రామ్మోహన్, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గురుపూజోత్సవంలో పాల్గొన్న శిష్యులు

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి-తాళ్లరేవు

గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరంగనాయకపురంలోని నిర్మలానంద చింతనాచార్యులు 11వ వార్షిక ఆరాధన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గురువులను సత్కరించారు. గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశ్వర్లు ఇంటిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొబ్బిశెట్టి జగపతి ఆచార్యుల శిష్యులు, దంతులూరి జగన్నాథరాజు శిష్యులు, సుంకర రామారావు శిష్యులు, చింతనాచార్యులు ఆకుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణమూర్తి, నిర్మలానంద కొపనాతి, బాలకృష్ణ, నిర్మలాంబ రాజయోగి రాము మాతాజీ, లోకేష్ ఆచార్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



దీక్షలు చేపట్టిన ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని దీక్ష

ప్రజాశక్తి - యానాం

యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్న సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సిబ్బంది మాట్లాడుతూ కో ఆపరేటివ్ సంస్థ తమకు 30 నెలలుగా బకాయి జీతాలు చెల్లించలేదని, దాని కారణంగా తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతకాలంగా అధికారులు, నాయకులు వేతనాలు అందిస్తామంటూ మాటలు మాత్రమే చెప్పుకుంటూ వచ్చారని వేతనాలు మాత్రం అందించలేదన్నారు. తక్షణమే తమకు వేతనాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇపిఎఫ్ తక్షణమే కట్టాలని, ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని, లిక్కర్ స్కామ్ నిందితులపై చర్యలు చేపట్టి విచారణ అనంతరం వచ్చిన సొమ్మును రికవరీ చేయాలని కోరారు. యథావిధిగా రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు, బియ్యాన్ని అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కోఆపరేటివ్ స్టోర్స్ సేల్స్ మ్యాన్స్‌కు హెల్పర్లుగా పని చేస్తున్న వారికి తక్షణమే గుర్తింపు కల్పించాలని, తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని దీక్షా శిబిరం వద్ద సిబ్బంది మాట్లాడారు. యానాం ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్ దీక్ష శిబిరం వద్ద సిబ్బందికి మద్దతు ప్రకటించారు. వారి డిమాండ్లు పరిష్కరించే వరకు ఎంప్లాయిస్ యూనియన్ సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

మెరి లైఫ్‌పై అవగాహన

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెరి లైఫ్ కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల్లో ఎన్ఎస్ఎస్ 1, 2 ఆధ్వర్యంలో మెరి లైఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అయ్యన్న నగర్, కురసంపేట తదితర గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెవి.సుధాకర్, వరుగు భాస్కర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సి.నరేష్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు వరదలు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో యానాం ప్రాంత ప్రజలు, తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఇప్పటికే ఉత్తర భారత దేశంలో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తున్నాయన్నారు. మహారాష్ట్ర ప్రాంతాల్లో సైతం కొద్ది రోజులుగా భారీ వర్షాలు నమోదు అవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నది ప్రవాహం సైతం పెరుగుతుందని ముందస్తుగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యానాంలో రెవెన్యూ, ప్రజా పనుల శాఖ, మున్సిపాలిటి, పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.